క్లుప్తంగా

సామూహిక అక్షరాభ్యాసం

గూడూరురూరల్: మండలంలోని విందూరు ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ స్కూలులో ఆది శంకరాచార్య బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారులతో పాటు పాఠశాలలో చదువుతున్న 45 మంది విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగులు, విద్యాసామగ్రి పంపిణీ చేశారు. సంఘం సభ్యులు మధుసూదన్‌రావు, శ్రావణ్‌కుమార్, గురుప్రసాద్‌రావు, నరేష్, బాలాజి, పవన్‌కుమార్, రఘునాథ్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పెళ్లకూరు: మండలంలోని నెలబల్లి జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2003–04 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. తమకు విద్యాభ్యాసం చేసిన ఉపాధ్యాయులతో కలిసి పాఠశాల దశలో తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సంతోషంగా గడిపారు. ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు.

ముత్యాలమ్మకు పొంగళ్లు

చిల్లకూరు: తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఈఓ నవీన్‌కుమార్, చైర్మన్ సిద్ధారెడ్డి ఇంద్రసేనారెడ్డి పర్యవేక్షించారు.

వివాహిత ఆత్మహత్య

గూడూరురూరల్: మండలంలోని పాలిచెర్లరాజుపాళెం గ్రామానికి చెందిన ముప్పాళ్ల కావ్య(21) ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. పాలిచెర్లరాజుపాళెం గ్రామానికి చెందిన నరేష్‌కు ఆత్మకూరుకు చెందిన కావ్యతో ఐదేళ్ల క్రితం వివాహమైంది. కుటుంబ కలహాల కారణంగా ఆత్మహత్యకు పాల్పడినట్లు భావిస్తున్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నివాళి

తడ: తడకంద్రిగ పంచాయతీ వార్డు సభ్యుడు, అనపగుంట గ్రామానికి చెందిన పాల హరికృష్ణ(45) శనివారం రాత్రి మృతి చెందారు. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆదివారం అనపగుంటకు వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. ఆయన వెంట ఏఎంసీ మాజీ చైర్మన్ వెంకట కృష్ణారెడ్డి, శేఖర్‌బాబు ఉన్నారు.

గడప గడపకు సంక్షేమం

- ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



మానమాలలో సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య

ఓజిలి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గడప గడపకు సంక్షేమ పథకాలు అందుతుండడంతో ప్రజలంతా ఎంతో సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. ఆదివారం మానమాల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే, మండల నాయకులకు స్థానికులు గజమాలతో ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రతి కుటుంబానికి మంచి చేస్తున్న జగనన్నను మళ్లీ ఆశీర్వదించి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని కోరారు. సీఎంగా జగనన్న ఉంటేనే పేదలకు మేలు జరుగుతుందన్నారు. టీడీపీ నాయకుల మాటలను నమ్మవద్దని, అధికారం కోసం కల్లిబొల్లి హామీలు ఇస్తూ ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని అన్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారని గుర్తు చేశారు. మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్నికల్లో ఇచ్చిన 98.5 శాతం హామీలను నెరవేర్చామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గుంటమడుగు రవీంద్రరాజు, ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కట్టా వెంకటరమణారెడ్డి, కురుగొండ పీఏసీఎస్ అధ్యక్షురాలు ఉచ్చూరు శోభారాణి, సర్పంచ్ జీవనారెడ్డి, ఉప సర్పంచ్ హరనాథ్‌రెడ్డి, నాయకులు సాయివెంకటేష్‌రెడ్డి, సాయిసుప్రియ, గెడి శ్రీనివాసులురెడ్డి, ఎంపీడీఓ రజనీకాంత్, పీఎస్ రమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుమన్ పాల్గొన్నారు.

నేడు పర్యటన ఇలా

మండలంలోని ముమ్మాయపాలెం, మాచవరం గ్రామాల్లో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరగనుంది.

జగనన్న సురక్షతో సత్వర సేవలు

అర్హత ఉండి ఇంకా సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి మేలు చేసేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సీఎం ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే కిలివేటి అన్నారు. మానమాల గ్రామంలో కురుగొండ సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలతో పాటు ఆధార్, రేషన్, కుల, మరణ, ఆదాయ తదితర సర్టిఫికెట్లు అవసరమైన వారిని గుర్తించి త్వరితగతిన మంజూరయ్యేలా చూడాలన్నారు.

భక్తిశ్రద్ధలతో గంధోత్సవం



గంధోత్సవంలో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, దర్గా కమిటీ సభ్యులు

గూడూరు: పట్టణంలోని హజరత్ హాషిం హుస్సేనీ దర్గాలో శనివారం రాత్రి గంధోత్సవం ఘనంగా నిర్వహించారు. దర్గా కమిటీ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ ఇంటి నుంచి గంధాన్ని ఊరేగింపుగా దర్గా వద్దకు చేర్చారు. మతగురువులు ఖలీఫా, మగ్దూమ్ అలీషా, ఖదీర్ అలీషా, ఖమర్ అలీషా ప్రత్యేక ప్రార్థనలు జరిపి బాబా సమాధి వద్ద ఉంచారు. ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం అన్నదానం కార్యక్రమం జరిగింది. దర్గా కమిటీ గౌరవాధ్యక్షుడు లయన్ షేక్ రియాజ్ అహ్మద్, అధ్యక్షుడు షేక్ రియాజ్ అహ్మద్, జలీల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



ప్రతిభా పురస్కారాలను అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

గూడూరురూరల్: పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన గూడూరు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆదివారం ప్రతిభా పురస్కారాలను అందజేశారు. అలాగే 1973–74 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో పాఠశాల లైబ్రరీకి సామగ్రి అందజేశారు. తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో తోడ్పాటును అందిస్తున్నామని పూర్వ విద్యార్థి, రిటైర్డ్ ఇండస్ట్రియల్ ఆఫీసర్ మేగూరు శ్రీధర్‌రెడ్డి తెలిపారు. భవిష్యత్తులో పాఠశాల అభివృద్ధికి సహకారం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రవూఫ్ పాల్గొన్నారు.

నేటి నుంచి రాపూరులో గడప గడపకు

రాపూరు: మండలంలో సోమ, మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని జేసీఎస్ కన్వీనర్ దండోలు నారాయణరెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరగ మురళీధర్ పాల్గొంటారని చెప్పారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు గోనుపల్లి సచివాయం పరిధిలోని పెంచలకోన, గోనుపల్లి, మంగళవారం గొనుపల్లి సచివాయం పరిధిలోని ప్రాంతాల్లో పర్యటిస్తారని చెప్పారు.

అర్హులందరికీ పక్కా ఇళ్లే లక్ష్యం

వెంకటగిరి: పట్టణ పరిధిలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పక్కా ఇల్లు మంజూరు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం అర్బన్ హౌసింగ్ పథకాన్ని తీసుకొచ్చిందని మున్సిపల్ కమిషనర్ బీవీ రామయ్య అన్నా రు. అర్బన్ హౌసింగ్ పథకం ప్రారంభమై 8 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం ర్యాలీ నిర్వహించారు.

విశ్వోదయ అభివృద్ధికి సహకారం

వెంకటగిరి: పట్టణంలోని విశ్వోదయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని కళాశాల పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షుడు బీకే ప్రసాద్, కార్యదర్శి అల్లం రాజా తెలిపారు. కళాశాలలో ఆదివారం పూర్వవిద్యార్థుల సమావేశం జరిగింది. జూలైలో నాక్ బృందం కళాశాలను సందర్శించనున్న నేపథ్యంలో కళాశాలకు ఉత్తమ గ్రేడ్ తీసుకొచ్చేందుకు చేపట్టాల్సిన మౌలిక సదుపాయాల కల్పనకు తోడ్పాటు అందిస్తామని చెప్పారు. ప్రిన్సిపల్ అరుణ్‌కుమార్, అధ్యాపకులు నాగరాజు, వెంకటసుబ్బయ్య, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకటగిరి ఎంపీడీఓగా విజయలక్ష్మి

వెంకటగిరిరూరల్: వెంకటగిరి ఎంపీడీఓగా విజయలక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా పరిషత్ నుంచి తనకు ఆదేశాలు అందినట్లు ఆమె తెలిపారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేస్తున్న కరిముల్లా సెలవులపై వెళ్లడంతో అప్పటి నుంచి ఆమె ఇన్‌చార్జి ఎంపీడీఓగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలో పూర్తిస్థాయిలో బాధ్యతలు అప్పగించారు.

టీడీపీవి చిల్లర రాజకీయాలు



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ కటకం దీపిక

నాయుడుపేటటౌన్: టీడీపీ నేతలు కొందరు చిల్లర రాజకీయాలు చేస్తున్నారని నాయుడుపేట మున్సిపల్ చైర్మన్ కటకం దీపిక విమర్శించారు. పట్టణంలో పలుచోట్ల ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీలను చించివేసి దుర్మార్గంగా వ్యవహరించడంపై ఆమె మండిపడ్డారు. ఆదివారం పార్టీ నాయకులతో కలిసి తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. టీడీపీ నేతలు యువగళం పేరుతో జరుపుతున్న పాదయాత్ర, బహిరంగ సభలకు తమ పార్టీ నేతలు ఎక్కడా అడ్డు చెప్పకుండా హుందాతనంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. అయితే టీడీపీ నేతలు కొందరు చిల్లర రాజకీయలు చేస్తూ తమ పార్టీ ఫ్లెక్సీలను చించివేయడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. టీడీపీ పాదయాత్ర, బహిరంగ సభల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో పాటు నాయకులపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు. నాయుడుపేట మున్సిపాలిటీతో పాటు నియోజవర్గంలో కళ్ల ముందే అభివృద్ధి కనిపిస్తున్నా సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యపై బురద జల్లే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. వాటిని ఎమ్మెల్యే పట్టించుకోకుండా కేవలం అభివృద్ధే ధ్యేయంగా పనిచేయడం ఆయన హుందాతనానికి నిదర్శనమన్నారు. ఆయన్ను చూసైనా టీడీపీ నాయకులు చిల్లర రాజకీయలు మానుకుని హుందాగా వ్యవహరించాలని హితవుపలికారు. మరోసారి ఇలాంటి సంఘటనలు పునారవృతమైతే పరిస్థితులు వేరుగా ఉంటాయని హెచ్చరించారు. ఆమెతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు బైనా మల్లికార్జున రెడ్డి, కటకం జయరామయ్య, పేట చంద్రారెడ్డి, షేక్ రహంతూల్లా ఉన్నారు.

ఎన్‌డీసీసీబీ డైరెక్టర్‌కు నేదురుమల్లి పరామర్శ



వెంకటరమణయ్యను పరామర్శిస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి

కోట/వాకాడు: కోట మండలం విద్యానగర్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ నేత, ఎన్‌డీసీసీబీ డైరెక్టర్ నరమాల వెంకటరమణయ్యను ఆదివారం వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పరామర్శించారు. వెంకటరమణయ్య మనమరాలు అక్షిత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఈ మేరకు ఆయన నివాసంలో అక్షిత చిత్ర పటానికి నివాళులర్పించిన అనంతరం వెంకటరమణయ్య కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. ఆయన వెంట నాయకులు నాగూర్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు మొబీన్‌బాషా, రామచంద్రరెడ్డి, శేషురెడ్డి ఉన్నారు. అలాగే వాకాడు చర్చి కాంపౌండ్‌కు చెందిన రిటైర్డ్ లెక్చరర్ కలపాటి ఎఫ్రాయమ్ కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి భార్య రిటైర్డ్ హెచ్ఎం కె.ధానమ్మ, కుమారులు వసంత్, రాజీవ్‌లను ఓదార్చారు. వాకాడు ఏఎంసీ చైర్‌పర్సన్ వాకాటి నాగభూషణమ్మ, నాయకులు దేవారెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి, సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

జగనన్న సురక్ష ప్రజలకు వరం



సైదాపురం: ప్రజల అవసరాలను తెలుసుకుంటున్న ఎంపీడీఓ

సైదాపురం: జగనన్న సురక్ష పథకం ప్రజలకు వరం లాంటిదని తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని అనంతమడుగు, చాగణం రాజుపాళెం గ్రామాల్లో ఆదివారం జగనన్న సురక్ష పథకంపై సర్వే చేశారు. అర్హులై ఉండి సంక్షేమ పథకాలు రాని లబ్ధిదారులను గుర్తించి వారికి న్యాయం చేస్తామన్నారు. సచివాలయాల ద్వారా 9 రకాల సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు.

దొరవారిసత్రం: నెలబల్లి గ్రామ సచివాలయం పరిధిలో జరుగుతున్న జగనన్న సురక్ష పథకం కార్యక్రమాన్ని ఎంపీడీఓ సింగయ్య, తహసీల్దార్ గోపీనాథ్‌రెడ్డి ఆదివారం తనిఖీ చేశారు. సచివాలయం సిబ్బంది, గ్రామ వలంటీర్లు ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవసరమైన సేవలను అందించాలన్నారు.

జ్ఞానం లేని అజ్ఞాని నారాలోకేష్

నాయుడుపేట: టీడీపీ నేత నారా లోకేష్ జ్ఞానం లేని అజ్ఞాని అని అంబేడ్కర్ ధర్మపోరాటసమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తూపిలి నాగరాజు అన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి గౌరవించలేని లోకేష్‌కు దళితుల గురించి మాట్లాడే నైతిక హక్కులేదని విమర్శించారు. ఎప్పుడూ ప్రభుత్వంపై విమర్శలు చేయడమే ఆయన పని అన్నారు. టీడీపీ నేతలు దళితులను పావులుగా వాడుకుంటున్నారని దుయ్యబట్టారు. ఆ పార్టీలోని ఎస్సీలు, ఎస్టీలు ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు.